క్లుప్తంగా

అక్రమ మద్యంపై ప్రత్యేక దృష్టి



సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

పెనుకొండ రూరల్: పట్టణంలోని ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. మద్యం దుకాణదారులు సమయ పాలన తప్పక పాటించాలన్నారు. అక్రమ మద్యం ప్రవేశించకుండా చర్యలు చూపాలన్నారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహులు, ఎస్ఐలు రాజశేఖర్, రాముడు పాల్గొన్నారు.

ప్రాథమిక శిక్షణ ప్రారంభం



శిక్షణ తీసుకుంటున్న సభ్యులు

అమరాపురం: స్థానిక సరస్వతీ విద్యా మందిరంలో ప్రాథమిక శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా సంఘచాలకులు లింగేష్ ప్రారంభించారు. శిక్షణ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి సభ్యులు వచ్చారు. వారికి ఈ నెల 30వ తేదీ వరకూ వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తారు. కరాటే, కబడ్డీ, దండం తదితర వాటిలో శిక్షణ ఇవ్వడంతో పాటు దేశభక్తి భావాలను పెంపొందించేలా శిక్షణ ఇస్తామని లింగేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగభూషణ, బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

రెండో దశ డిగ్రీ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం టౌన్: డిగ్రీ రెండో దశ అడ్మిషన్లకు ఈ నెల 26 నుంచి 29 వరకూ అవకాశం కల్పిస్తున్నట్లు పట్టణంలోని ఎస్ఎస్బీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రగతి తెలిపారు. ఇప్పటి దాకా రిజిస్టర్ చేసుకోని విద్యార్థులు, డిగ్రీలో చేరాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు 29లోపు రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈనెల 27 నుంచి 29 వరకూ ఉంటుందని, 29 నుంచి అక్టోబర్ 1 వరకూ విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించారు. గతంలో రిజిస్టర్ చేసుకుని అప్లికేషన్ పెండింగ్‌లో ఉన్న వారు, తిరస్కరించబడిన వారు తిరిగి తమ లాగిన్ ద్వారా సర్టిఫికెట్లను అప్లోడ్ చేసుకోవాలన్నారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోని వారు, ఇతర కళాశాలలు, కోర్సుల్లో చేరి మార్చుకోవాలనుకున్న వారు కావాలనుకుంటే ఆప్షన్లు ఇచ్చుకోవచ్చన్నారు.

పాటతో ప్రజల గుండెల్లో నిలిచిన వ్యక్తి ఎస్పీబీ



ఎస్పీ బాలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పరిగి: తెలుగు సినీ సంగీతానికి వన్నెతెచ్చి, తన గానామృతంతో శ్రోతల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయిన ప్రపంచ ప్రఖ్యాత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యమని వక్తలు పేర్కొన్నారు. ఎస్పీ బాలు వర్ధంతి సందర్భంగా పరిగి మండలంలోని సేవామందిరం ఏఎం లింగణ్ణ మెమోరియల్ స్కూల్ ప్రాంగణంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీబీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీబీ గీతాలను గాయకులు ఆలపించారు. కార్యక్రమంలో సేవామందిరం వ్యవస్థాపక సంస్థ అధ్యక్షుడు కేటీ శ్రీధర్, ఎంఈఓ గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు



ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన పీఆర్ డీఈ వెంకటేశులు

మడకశిర: నియోజకవర్గంలో పీఆర్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యత ప్రమాణాలను పెంచాలని స్థానిక పీఆర్ డీఈ వెంకటేశులు సూచించారు. గురువారం పీఆర్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశమయ్యారు. సీసీ రోడ్లు, ఎంపీ లాడ్స్ నిధులతో చేపట్టిన బస్ షెల్టర్లు తదితర పనులపై ఆయన సమీక్షించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వృత్తి విద్య కోర్సులపై అవగాహన

గుడిబండ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం విద్యార్థులకు వృతి విద్య కోర్సులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతో పాటు వృత్తి విద్య కోర్సుపై ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం గోవిందప్ప, పీఈటీ ఆజాద్, ఒకేషనల్ టీచర్లు భాగ్యలక్ష్మీ, సుష్మా, విద్యార్థులు పాల్గొన్నారు.



పెచ్చులూడిన పెనుకొండ తహసీల్దార్ కార్యాలయం



సోమందేపల్లి ఎంపీడీఓ కార్యాలయం దుస్థితి

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

- ఎప్పుడు కూలతాయో తెలియని పరిస్థితి
- బిక్కు బిక్కుమంటూ గడుపుతున్న ఉద్యోగులు
- కార్యాలయాల్లోకి వెళ్లేందుకు జంకుతున్న జనం

సోమందేపల్లి: ప్రభుత్వ కార్యాలయాలు పరిస్థితి దయనీయంగా తయారైంది. శిథిలావస్థలో చేరుకున్న భవనాల్లోనే ప్రభుత్వ ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలు కూడా అవి ఎప్పుడూ కూలతాయోనని ఆందోళన చెందుతున్నారు. సోమందేపల్లిలోని మండల పరిషత్ కార్యాలయం, పశు వైద్యశాల, తహసీల్దార్ కార్యాలయాల పైకప్పులు దెబ్బతిన్నాయి. వర్షం వస్తే గదుల్లో వర్షపు నీరు కారే పరిస్థితి. పెనుకొండ తహసీల్దార్ కార్యాలయంతో పాటు పరిగి వ్యవసాయశాఖ కార్యాలయం భవనాలు కూడా దెబ్బతిని పెచ్చులు ఊడుతున్నాయి. పక్కా భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నాయి.



పరిగి వ్యవసాయశాఖ కార్యాలయం ఇలా..

ప్రభుత్వ దృష్టి సారించాలి



ప్రభుత్వ కార్యాలయాల భవనాలు అధ్వానంగా తయారయ్యాయి. సోమందేపల్లి తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల భవనాలు దెబ్బతిన్నాయి. వర్షం వస్తే కార్యాలయాలపు గదుల్లో పై కప్పులు ఎప్పుడూ పడుతాయో తెలీడంలేదు. పశువైద్య శాల పరిస్థితి కూడా అలాగే ఉంది.

– శ్రీనివాసులు సోమందేపల్లి

మరుమ్మతు చేపట్టాలి



దెబ్బతిన్న భవనాల స్థానంలో కూటమి ప్రభుత్వం నూతన భవనాలను నిర్మించాలి. మండలంలో కీలకమైన శాఖలైన ప్రభుత్వ కార్యాలయాల దుస్థితిని ఆయా శాఖల అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. ప్రస్తుతానికి కనీసం మరమ్మతు అయినా చేయిస్తే మేలు. ఎలాంటి ప్రమాదాలు జరగకనే అప్రమత్తమవ్వాలి.

– వెంకటరాముడు, సోమందేపల్లి

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



లేపాక్షిలో మొక్క నాటుతున్న పీడీ సుదర్శన్



రొళ్ల: మొక్క నాటుతున్న డీఎల్‌పీఓ శివనారాయణరెడ్డి

రొళ్ల: ప్రతి ఒక్కరూ కూడా మొక్కలు పెంపకాన్ని అలవర్చుకుని పర్యావరణాన్ని పరిరక్షించాలని పెనుకొండ డీఎల్‌పీఓ శివనారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రీ, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ శ్రీనాథ్, ఏపీఓ ఓబుళప్ప, ప్లాంటేషన్ సూపర్ వైజర్ నరహరి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలోని 1వ వార్డు ఇస్లాపురం గ్రామంలో నగర పంచాయతీ అధికారులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఏక్ దిన్ ఏక్ గంటా ఏక్ సాత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల పరిసరాల్లో శుభ్రత పనులు చేపట్టారు. నగర పంచాయతీ కమిషనర్ సతీష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలోని కోట వీధిలో గురువారం ఎంపీడీఓ రామరావు ఈఓఆర్డీ సుధాకర్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిచ్చి మొక్కలు, గడ్డి, మరుగు నీటిని నిలవ ఉండకుండా శుభ్రం చేశారు.

లేపాక్షి: మండలంలోని అన్ని సచివాలయాల వద్ద గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించడం, కలుషిత నీరు లేకుండా చూడడం, నీటి పైపులు లీకేజి నివారించడం లాంటి కార్యక్రమాలను చేపట్టారు. లేపాక్షిలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదర్శన్ పాల్గొని మొక్కలు నాటారు. ఎంపీడీఓ నరసింహమూర్తి, ఈఓఆర్డీ నాగరాజు, సర్పంచ్ ఆదినారాయణతో పాటు గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిపరాశక్తీ నమోస్తుతే !

సాక్షిబృందం: శరన్నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నాల్గవరోజు గురువారం హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అమ్మ వారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రూపాల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు.



గోరంట్ల: శాకంబరిగా చౌడేశ్వరీదేవి




పెనుకొండ: గాయత్రీదేవిగా మహేశ్వరి



పరిగి: కాత్యాయనిదేవిగా సప్తమాతృక అమ్మవారు



లేపాక్షి: కాత్యాయనిదేవిగా దుర్గాదేవి



రొళ్ల: కుష్మాండదేవిగా కొల్హాపురి మహాలక్ష్మీదేవి



పావగడ: చెర్రీ ఫ్రూట్స్ అలంకరణలో దుర్గమ్మ



దుర్గాదేవిగా గౌడనకుంట కెంచమాంబదేవి



హిందూపురం: జయ శంకరీ దేవిగా కొల్హాపురి లక్ష్మీదేవి



హిందూపురం: అర్ధనారీశ్వరీ దేవిగా రేణుకా యల్లమ్మదేవి

దోమల బెడద నుంచి కాపాడండి

హిందూపురం టౌన్: పట్టణంలో దోమల బెడద తీవ్రంగా ఉందని, దోమల నుంచి ప్రజలను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ చాంబర్ ఎదుట నిరసన తెలిపారు. సీపీఐ తాలుకా కార్యదర్శి వినోద్ కుమార్, మహిళా సమైఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సబీరా మాట్లాడుతూ పట్టణంలోని సీపీఐ కాలనీలో ప్రభుత్వ బాలికల వసతి గృహాలు, పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయం తదితర విద్యాసంస్థలు ఉన్నాయన్నారు. అయితే ఆ ప్రాంతంలో పట్టణంలోని చెత్తాచెదారం, మాంసం వ్యర్థాలను తీసుకువచ్చి పడేస్తున్నారన్నారు. దీంతో అక్కడ దోమలు , కుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. ఈ కారణంగా విద్యార్థులు తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారని చెప్పారు. దోమల నివారణకు ఫాగింగ్ చేసేవారే లేరని మండిపడ్డారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకుని, ప్రజలను అనారోగ్యాల బారి నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు.



మున్సిపల్ కమిషనర్ చాంబర్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

రొద్దం: రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను ఉపయోగించడంతో భూసారం పెరిగి, పంటలకు అవసరమైన పోషకాలు అంది అధిక దిగబడులు వస్తాయని జిల్లా మూల్యాంకణ అధికారి వెంకటేష్ అన్నారు. గురువారం మండలంలోని గొరాజుపల్లిలో ఆయన వ్యవసాయశాఖ అధికారులతో కలిసి పర్యటించారు. ఇండ్‌గ్యాప్(ఉత్తమ వ్యవసాయ యాజమాన్య పద్ధతులు) కోసం రొద్దం ఎఫ్ఓ ద్వారా ఏపీఎస్ఓసీసీఏ(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ)కి నమోదు చేసుకున్న గొరాజుపల్లికి సంబంధించిన 30 మంది రైతులకు సంబంధించి పంటలను ఆయన పరిశీలించారు. పంటలకు సంబంధించి రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించారు. సేంద్రియ ఉత్పత్తుల ప్రాముఖ్యత వివరించారు.



సేంద్రియ పంటలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

స్మార్ట్‌కార్డుల పంపిణీ

సాక్షిబృందం: పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో గురువారం ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్‌కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తహసీల్దార్లు, సచివాలయ సిబ్బంది, రేషన్ డీలర్లు ఆయా ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ప్రతి ఇంటిని సందర్శించాలి

లేపాక్షి: భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు లేపాక్షి మండలంలో ఓటరు జాబితాపై ప్రతి ఇంటిని సందర్శించి, ఓటర్లను పరిశీలించాలని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి పేర్కొన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్ఓలతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.

నానో యూరియాతో ఖర్చు తక్కువ

రొళ్ల: మండల పరిధిలోని హొట్టేబెట్ట సచివాలయ ఆవరణలో గురువారం మండల వ్యవసాయశాఖాధికారి వెంకటబ్రహ్మం ఆధ్వర్యంలో రైతులకు నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ మామూలు యూరియా వాడకంలో పంటపై చల్లుకోవడానికి రైతులకు ఇబ్బంది ఉందని, అయితే నానో యూరియాను డ్రిప్ సహాయంతో పంటసాగులో వాడుకొని ఖర్చులు కూడా తగ్గించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ శివప్రియ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోండి

అమరాపురం: స్థానిక కెనరా బ్యాంకులో అందిస్తున్న వివిధ సేవలను ప్రజలు, విద్యార్థులు, రైతులు, మహిళలు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు మేనేజర్ సూర్యదేవానాయక్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అటల్ యోజన పథకం, సురక్షా బీమా యోజన, అటల్ పింఛన్ యోజన, జ్యోతి బీమా, తదితర పథకాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం

పావగడ: పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలకు మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని స్థానిక స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీఓ సునీత పేర్కొన్నారు. తాలూకాలోని రాజవంతి గ్రామం కాలనీలోని అంగనవాడీ కేంద్రంలో నిర్వహించిన జాతీయ పోషణ్ మాసాచరణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లా నిరూపణాధికారి అంబిక , గ్రామ పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

చిలమత్తూరు: కర్ణాటక రాష్ట్రంలోని బాగేపల్లి విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల పరిధిలోని మరవకొత్తపల్లికి చెందిన ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. పని ముగించుకొని తిరిగి వస్తున్న క్రమంలో విద్యుత్ కార్యాలయం వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద బస్సు.. ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన లక్ష్మీనారాయణను బెంగళూరుకు తరలించారు.

పండిట్ దీన్ దయాళ్‌కు ఘన నివాళి

హిందూపురం: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని బీజేపీ రాష్ట్ర నాయకుడు రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో దీనదయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. 11వ వార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనతో పాటు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి రవి, పాపన్న, ప్రభాకరాచారి, డాలేశ్వర్, శివప్ప, మంజు, శ్రీరాములు, సాయి, గణేష్, మహేష్,వంశీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీన్ దయాళ్ సేవలను కొనియాడారు.

వైఎస్ జగన్‌ను కలసిన ఈరలక్కప్ప



వైఎస్ జగన్‌ను సన్మానిస్తున్న ఈరలక్కప్ప

మడకశిర: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌ను ఈరలక్కప్ప శాలువాతో సన్మానించారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని జగన్ సూచించినట్లు ఈరలక్కప్ప తెలియజేశారు. పార్టీ కార్యకర్తల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సూచించారన్నారు.

అగ్రిసెట్‌లో ప్రతిభ



చంద్రశేఖర్ (3వర్యాంకు)



ద్వారకారాణి (20వ ర్యాంకు)



జనార్దన్ (29వ ర్యాంకు)

మడకశిరరూరల్: ఎన్జీరంగా విశ్వవిద్యాలయం నిర్వహించిన రాష్ట్రస్థాయి అగ్రి సెట్ పరీక్షలో మడకశిర ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్‌కు చెందిన 20 మంది విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సరోజినీదేవి తెలిపారు. చంద్రశేఖర్ 3వ ర్యాంకు, ద్వారకారాణి 20, జనార్దన్ 29, గణేష్ 34, చరణ్‌తేజ 35, షాహిద 51, తేజస్విని 122, దివ్యజ్యోతి 135, సత్యపరిమళ 212 , నవీన్ 252వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు.

ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం



రోగులకు పండ్లను అందిస్తున్న ఫార్మసిస్ట్ అసోసియేషన్ సభ్యులు

హిందూపురం టౌన్: హిందూపురం కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్ , అసోసియేషన్ కార్యదర్శి అనిల్, కోశాధికారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీల్లోకి ఇతర కులాలను చేర్చొద్దు



వినతిపత్రమిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

పావగడ: ఎస్టీ జాబితాలోకి ఇతర అగ్ర కులాలను చేర్చకూడదంటూ స్థానిక వాల్మీకి సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాలూకా కార్యాలయం ఎదుట గురువారం వాల్మీకి సంఘం నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. తాలూకా మదకరి నాయక సంఘం అధ్యక్షుడు డా ఓంకార నాయక, పాళేగార్ లోకేశ్, డీఐజీ నారాయణప్ప, రంగమ్మ, జ్ఞానేశ్‌బాబు, శ్రీ కృష్ణ, ఆనంద్, ఓంకారనాయక, లక్ష్మీనారాయణ, బేకరి నాగరాజు, ప్రకాశ్, రామాంజి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రేడ్ 2 తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది గ్రామంలో గురువారం వైద్యారోగ్యశాఖ, పోర్డు సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై చిత్ర పదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోర్డు సంస్థ ప్రాజెక్టు మేనేజర్ బదరీష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకుని నివారణకు కృషిచేయాలన్నారు. వ్యాధిగ్రస్తులపై ఎలాంటి వివక్షత చూపుకూడదన్నారు.